## ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 19 : మహ్మద్ ప్రవక్త బాటలో ప్రతి ఒక్కరూ నడువాలని ముస్లింలు సూచించారు. నిర్మల్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీ తీశారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తును నిర్వహించారు. కార్యక్రమంలో ఇసాక్ అలీ, అన్వర్ పాషా, ముస్తఫా, షాకీర్, షహజాద్, రసూల్, మసూద్ పాల్గొన్నారు.

## నీటి విడుదల



గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ నీటిని విడుదల చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసాటౌన్, సెప్టెంబర్ 19 : గడ్డెన్న వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని గురువారం ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో సాగు నీటి కోసం ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. యాసంగిలో 10వేల ఎకరాలు సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ అనిల్, ఏఈ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరుపుకోవాలి

కుంటాల, సెప్టెంబర్, 19 : వినాయక నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం కుంటాలలోని పలు గణపతి మండపాలను దర్శించుకున్నారు. యువ యూత్ గణేశ్ మండపం వద్ద జరిగిన వేలంలో సబ్బిడి గజేందర్ (చింటు) రూ. 18వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గజ్జారాం, మాజీ ఎంపీటీసీ రవి, నవీన్, యువ యూత్ సభ్యులు ఉన్నారు.

## నిర్మల్ ఎస్పీకి ఘన సన్మానం

ముథోల్, సెప్టెంబర్ 19 : ముథోల్‌లోని హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లోని కార్యాలయంలో ఎస్పీ జానకిషర్మిలతో పాటు భైంసాలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవడానికి సహకారం అందించినందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేశ్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షులు తాటివార్ రమేశ్, కోరి పోతన్న, సభ్యులు సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలంకు సన్మానం

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : గణేశ్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసుల కృషి అభినందనీయమని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. గురువారం కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ గౌష్ ఆలంకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు. ముఖ్యంగా పోలీసులు, ఇతర శాఖల అధికారులందరి సహకారంతో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందన్నారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి మాధవ్, సభ్యులు పూసం ఆనంద్, కొత్తపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అయిండ్ల భీంరెడ్డి వర్ధంతి

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 19: మునిపల్లి గ్రామంలో గ్రామస్తులు గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీంరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణచాంద మండలానికి, నిర్మల్ నియోజకవర్గానికి ఆయన అందించిన సేవలను కొనయాడారు. కార్యక్రమంలో భీంరెడ్డి తనయుడు అయిండ్ల భూపాల్ రెడ్డి, గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతను పాటించాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 19: గ్రామాల్లో స్వచ్ఛతను పాటించాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రూపు సభ్యులతో స్వచ్ఛతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావ్, పంచాయతీ ఈవో సంజీవరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల, సెప్టెంబర్ 19 : కుంటాల మోడల్ స్కూల్‌లో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. పీజీటీ తెలుగు -1, పీజీటీ మ్యాథ్స్ -2, పీజీటీ కామర్స్ -1, టీజీటీ సైన్స్ -1 ఖాళీలకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ, టీజీటీలకు డిగ్రీ, బీఈడీ, టెట్ విద్యార్హతలు ఉండాలని, మరిన్ని వివరాలకు పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ, సెప్టెంబర్ 19 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇచ్చోడ పీహెచ్‌సీ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు రవీందర్ సూచించారు. గురువారం ఇచ్చోడలోని అంబేద్కర్ నుంచి హైస్కూల్ వరకు దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు, వ్యాపారస్తులు చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని సూచించారు. రోడ్డు చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వైద్యాధికారులు ఉత్తమ్, వసంత్ పాల్గొన్నారు.

## నగదు అందజేత

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 19: ఘన్‌పూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ కుమ్ర మీరాబాయి అనారోగ్యంతో ఈ నెల 17న మృతి చెందింది. అంత్యక్రియల ఖర్చు నిమిత్తం గురువారం అధికారులు మృతురాలి తల్లి సీతాబాయికి రూ.20వేలు అందజేశారు.

## కల్యాణ మండపం ప్రారంభం

నర్సాపూర్ (జీ). సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో గురువారం శ్రీ శ్రీ శివానంద భారతి స్వామి చేతుల మీదుగా కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలు సవరించుకోవాలి

- రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎన్నికల ఓటరు ముసాయిదాపై సమావేశం



బోథ్ : మాట్లాడుతున్న ఎంపీడీవో జీవన్ రెడ్డి

నార్నూర్, సెప్టెంబర్ 19 : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే సవరించుకోవాలని తహసీల్దార్ జాడి రాజలింగం అన్నారు. నార్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించామన్నారు. జాబితాలో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్‌లాల్, నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీం పాషా, ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బోథ్, సెప్టెంబర్ 19 : బోథ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవన్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా మార్పులు, సవరణలు, దరఖాస్తులు ఈ నెల 21వ తేదీలోపు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బేల, సెప్టెంబర్ 19 : బేల మండల పరిషత్ కార్యాలయంలోఎంపీడీవో మహేందర్ కుమార్ వివిధ పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు మార్పులకు అవకాశం ఉందని అన్నారు. రాజకీయ నాయకులను సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వినోద్ కుమార్, నాయకులు రాందాస్ నాక్లే, రూపేశ్ రెడ్డి, ఫైజుల్లా ఖాన్, వీపీన్ ఖోడే, రాము, రవికుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 19 : దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణరాణి వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎన్నికల ఓటరు ముసాయిదాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు ముసాయిదాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీలోపు మండల పరిషత్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలిపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, రాజకీయ పార్టీల నాయకులు అనిల్, సురేశ్ కుమార్ పాల్గొన్నారు.



ముథోల్: మాట్లాడుతున్న డీఎల్పీవో సుదర్శన్ పాటిల్

కుంటాల, సెప్టెంబర్ 19: గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులను ఈ నెల 26లోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో లింబాద్రి సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో రహీం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తు, బీజేపీ ప్రతినిధి జక్కుల గజేందర్, కాంగ్రెస్ నుంచి మాజీ సర్పంచ్ ముజిగే ప్రవీణ్, నరేందర్, బీఎస్పీ ప్రతినిధి, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్, సెప్టెంబర్, 19: ఓటరు జాబితాలో సవరణను సరిచేసుకోవాలని డీఎల్పీవో సుదర్శన్ పాటిల్ అన్నారు. ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగాధర్, బీజేపీ నాయకులు పోతన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖానాపూర్, సెప్టెంబర్ 19: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 21 వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, సూపరింటెండెంట్ పీఎన్ స్వామి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పడిపోయిన స్తంభాలు



బాధిత రైతుల నుంచి వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

తాంసి, సెప్టెంబర్ 19: తాంసి మండలం గోట్కూరి గ్రామంలోని దళిత బస్తీలో మంజూరైన విద్యుత్ లైన్‌లో స్తంభాలు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పడిపోయాయని విద్యుత్ శాఖ అధికారులు అన్నారు. నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'దళిత రైతులపై చిన్న చూపు' కథనానికి అధికారులు స్పందించారు. గురువారం డీఈ హరికృష్ణ సంబంధిత అధికారులతో కలిసి గోట్కూరి రైతుల సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తానని అన్నారు. ప్రస్తుతం చేనులో పత్తి పంట ఉండడంతో నష్టం వాటిల్లుతుందని, పంట తొలగించిన తర్వాత విద్యుత్ లైన్ పూర్తి చేస్తామన్నారు. కాంట్రాక్టర్‌తో పనులను నాణ్యతగా చేయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో బాధిత రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, డీఈ హరికృష్ణ, ఏడీఈ శ్రావణ్, ఏఈ మనోజ్ కుమార్, అకౌంటెంట్ శంకర్, గంగాధర్, బాధిత రైతులు నిమ్మల సరిత, సురేశ్, లక్ష్మి, స్వామి పాల్గొన్నారు.


## ద్విచక్ర వాహనం చోరీ

కడెం, సెప్టెంబర్ 19 : పెద్దబెల్లాల్ గ్రామంలోని రైతు గోలి బుచ్చన్నకు చెందిన వాహనం చోరీకి గురైంది. బుచ్చన్న బుధవారం తన పొలానికి మందు చల్లుతున్న క్రమంలో వాహనాన్ని రోడ్డుకు ఆపి ఉంచాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనాన్ని అపహరించినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 19: పులిమడుగు గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. సోముగూడకు చెందిన కొరెంగ రాము(52)గా గుర్తించామని ఎస్ఐ మనోహర్ తెలిపారు. మృతదేహం పొదల మధ్య గాయాలతో పడి ఉండడంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## తేజాపూర్‌లో వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ, సెప్టెంబర్ 19 : తేజాపూర్ గ్రామంలోని రెడ్డి గణేశ్ మండలి వద్ద వినాయకుడిని గురువారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దర్శించుకున్నారు. వేదపండితుడు శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎస్సీ గణేశ్ మండలిని దర్శించుకున్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, రెడ్డి గణేశ్ మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 22న బుద్ధిస్ట్ పర్సనల్ లాపై సదస్సు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : బుద్ధిస్ట్ పర్సనల్ లాపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ నెల 22న ఆదిలాబాద్‌లోని కైలాస్ నగర్ బుద్ధ విహార్‌లో సదస్సును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మధుబవల్కర్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు బుద్ధిస్టులు పాల్గొనాలని కోరారు.

## విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బోధన పరంగా మరింత మెరుగు పరిచేలా రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థల పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత తెలిపారు. గురువారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఈవో, ఎంఎన్‌లు, ఏఎంవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో ప్రణీత మాట్లాడుతూ రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఇచ్చే పుస్తకాల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్, ఉదయశ్రీ, నారాయణ, రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, ఉదయశ్రీ, అజిత్, మహేందర్ పాల్గొన్నారు.

## వ్యాపారులుగా మారాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : స్వయం సహాయక బృందాలను వ్యాపారులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో డీఆర్డీఏ ద్వారా ఇచ్చినా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ సాయన్న అన్నారు. గురువారం వాణిజ్య, వర్తక, వ్యాపార సంఘాన్ని డీఆర్డీఏ పరిశీలించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా, మహిళలు ఉత్పత్తి చేస్తున్న వివిధ ఉత్పత్తులను, తమ వ్యాపార సంస్థల్లో ప్రదర్శించారు. వినియోగదారులకు పంపిణీ చేసి వారికి ఒక గుర్తింపు ఇవ్వాలన్నారు. మహిళా స్వయం సహాయక సభ్యులకు మా వంతుగా సహకారాన్ని అందిస్తామని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ అన్నారు.

## రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 19: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళాపై లైంగిక దాడి అఘాయిత్యాన్ని నిరసనగా ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడుందెబ్బ అనుబంధ సంఘాలైన ఆదివాసీ మహిళా సంఘం, ఆదివాసీ విద్యార్థి , ఆదివాసీ ఉద్యోగుల, ఆదివాసీ యువసేన, ఆదివాసీ సంక్షేమ పరిషత్, జై ఆదివాసీ యువశక్తి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు బారిక్‌రావ్, తుకారాం, రాజేశ్వర్, మురారి, రాము, పృథ్వీరాజ్, హనుమంత్‌రావ్, జుగదిరావ్, హరిదాస్, శంకర్, అంకుష్, ఇంద్రదేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం, సెప్టెంబర్ 19: జైనూర్ మండలంలోని ఆదివాసీ మహిళపై ఘటనను నిరసిస్తూ ఈ నెల 21వ తేదీన రాష్ట్రం బంద్ పిలుపునివ్వడం జరిగిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రూరల్ అధ్యక్షుడు మెస్రం కేశవ్ రావ్ తెలిపారు. ఈ బంద్ విజయవంతం కోసం వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు కళాశాలలు సహకరించాలన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండల ప్రధాన కార్యదర్శి రాము, సభ్యులు పాల్గొన్నారు.

## ఓఎఫ్‌సీ లైన్ పరిశీలన

కుంటాల, సెప్టెంబర్, 19: అంబకంటి జీపీలో రాయపాడ్ వద్ద జరుగుతున్న ఓ కంపెనీకి చెందిన ఓఎఫ్‌సీ లైన్ మార్కింగ్‌ను గురువారం డీఎఫ్ఓ నాగిని భాను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో శంకర్, ఎఫ్ఎస్‌వో కీర్తి, ఎఫ్‌బీవోలు హరిలత, ముస్తాక్ ఉన్నారు.

## అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

పెంబి, సెప్టెంబర్ 19: పెంబిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చర్చి నిర్మిసున్నారని పలు హిందూ సంఘాల నాయకులు గురువారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమాకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చర్చిని వెంటనే నిలిపివేయాలని కోరారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మిస్తుండడంతో ఫాదర్ యేసుదాసుకు నోటీసులు అందజేశారు. వెంటనే నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 28లోగా రుణాలు గ్రౌండింగ్ చేస్తాం

బోథ్, సెప్టెంబర్ 19: ఈ నెల 28వ తేదీలోగా టీజీబీ బోథ్ బ్యాంకులో రుణాలు పొందడానికి అర్హత ఉన్న 13 స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి 14 లక్షలు గ్రౌండ్ చేస్తామని టీజీబీ మేనేజర్ నాగ ఫణింద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలోని టీజీబీ బోథ్ బ్యాంకులో ఏరియాకు సంబంధించిన ఏపీఎం సీసీ వీవోళ్లకు సీబీఆర్ఎం సమావేశం నిర్వహించారు. అనంతరం డీఆర్డీసెర్ప్ ఏపీఎం, సీసీలు, వీవోఏలు కలిసి నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేనేజర్ నాగఫణింద్ర క్షేత్రాధికారి ప్రతాప్ క్యాషియర్ విద్యాసాగర్ అకౌంటెంట్ ఆనంద్‌ను శాలువాతో సన్మానించారు. సమావేశంలో ఏపీఎం మాధవ్, సీసీలు సంజీవ్, సుభద్ర, గంగాధర్, లక్ష్మయ్య, గంగాధర్, విజయలక్ష్మి, వీవోఏలు స్వామి, సాయిలు, గంగామణి, లక్ష్మి, సంగీత, నిరంజన, లక్ష్మి, బ్యాంక్ మిత్ర, జ్యోతి వినోద్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు, బకాయిలు విడుదల చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 19 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ పట్టణం, తదితర పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రచారి, ప్రధాన కార్యదర్శి చంద్రనాగకాంత్, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

## లారీ కింద పడి యువకుడి మృతి

తలమడుగు, సెప్టెంబర్ 19: లారీ కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన తలమడుగు మండలం కప్పర్దేవి గ్రామ పంచాయతీ పరిధిలోని మందగూడలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మందగూడకు చెందిన మెస్రం మహేందర్(23) బైక్‌పై తలమడుగుకు వచ్చి వ్యవసాయ మందులు తీసుకొని వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో లారీ డ్రైవర్ గమనించకుండా వెనక్కి రివర్స్ తీసుకునే క్రమంలో మహేందర్‌పై నుంచి పోవడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కోళ్ల పెంపకం లాభదాయకం




కోళ్లను పంపిణీ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 19: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి తోడుగా నిరుద్యోగులకు కోళ్ల పెంపకం లాభదాయకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం కల్లూర్ గూడ గ్రామంలో భావ్యపమం కోళ్ల పరిశోధన సంచనాలయం హైదరాబాద్ వారిచే 360 పెరిటి కోళ్లు, 100 కోళ్ల గూడులను పంపిణీ చేశారు. సంస్థ శాస్త్రవేత్తలు కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ బీ ప్రకాశ్, రాజ్‌కుమార్, విజయ్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే బాంజా, ఏవో భార్గవ్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# పరారీలో ఉన్న నేరస్తుడు పట్టివేత

**నిజామాబాద్ జైల్ నుంచి పెరోల్‌పై వచ్చి ఆటో దొంగతనం**



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ సీహెచ్ కరుణాకర్‌రావ్

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : రెండు సంవత్సరాలుగా పరారీలో ఉన్న నేరస్తుడిని ఆటో దొంగతనంతో పట్టించిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రాత్రి ఆదిలాబాద్ టూటౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లో ఈ నెల 17వ తేదీన అవైజ్ వ్యక్తికి సంబంధించిన ఆటో చోరీకి గురైంది. 18న టూ టౌన్‌లో ఆటో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సీఐ సీహెచ్ కరుణాకర్‌రావు, ఎస్ఐ విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రమేశ్ కేసు దర్యాప్తు చేపట్టారు. గురువారం పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ సమీపంలోని సీడబ్ల్యూసీ వద్ద మిస్సింగ్ అయిన ఆటోతో పాటు దొంగిలించిన సయ్యద్ అలీమ్‌ను పట్టుకున్నారు. పోలీసులు విచారించారు. పట్టణంలోని చోటా తాలాబ్‌కు చెందిన సయ్యద్ అలీమ్(37)పై 2014 సంవత్సరంలో లింగాపూర్‌లో ఆటో దొంగతనం చేసిన కేసులో సంవత్సరం జైలు శిక్ష విధించారు. అలాగే 2016 సంవత్సరంలో ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగికదాడి పాల్పడడంతో పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో 2019 సంవత్సరంలో జిల్లా పోక్సో కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించగా నిజామాబాద్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 22 అక్టోబర్ 2022న సయ్యద్ అలీం 30 రోజుల పెరోల్ రాగా జైలు నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత పెరోల్ సమయం కావడంతో మరో 15 రోజులు పొడిగించుకున్నాడు. తిరిగి 7 డిసెంబర్ 2022 నిజామాబాద్ జిల్లా కోర్టుకు సరెండర్ కావాల్సి ఉండగా హాజరుకాలేదు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. జనవరి 2024లో నిజామాబాద్ జిల్లా బోధన్‌లో పోలీస్ స్టేషన్‌లో సయ్యద్ అలీమ్‌పై కేసు నమోదైంది. రెండు సంవత్సరాల నుంచి జైలు శిక్ష నుంచి తప్పించుకొని తిరుగుతున్న అతడిని టూ టౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అతడిపై ఇంకా ఐదు కేసులు ఉన్నాయని తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సీహెచ్ కరుణాకర్‌రావు, ఎస్ఐ విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రమేశ్‌ను ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు. కాగా ఆటో దొంగతనం అయిన 24 గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. దీంతో రెండు సంవత్సరాలుగా నిజామాబాద్ పోలీసులకు తప్పించుకొని తిరుగుతున్న నేరస్తుడిని అరెస్టు చేసి మళ్లీ రిమాండ్‌కు తరలించారు.

## 21న బంద్‌ను విజయవంతం చేయాలి

బేల, సెప్టెంబర్ 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఆదివాసీ మహిళపై లైంగికదాడికి దాడికి యత్నించి హత్యాయత్నం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 21న నిర్వహిస్తున్న బేల బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్‌లో రాయిసెంటర్ సార్‌మేడి అధ్యక్షుడు సోనేరావ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు నందుకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈ బంద్‌కు మండల వ్యాపారులు, కార్మికులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాయిసెంటర్ ప్రధానకార్యదర్శి భీంరావ్, ఆదివాసీ నాయకులు చంద్రకాంత్, రవీందర్, దివాకర్, అనిల్, నిఖిల్ పాల్గొన్నారు.

## షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : ఆదిలాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం అండర్-14, 17 ఏళ్ల విభాగం బాల, బాలికల జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి హాజరై మాట్లాడారు. క్రీడలతోనూ ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. అనంతరం సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ కాంతారావుతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

## విద్యార్థులు న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఎదులాపురం,సెప్టెంబర్ 19 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో భారత్ దేఖో, ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో, డాక్టర్ అతిక్‌బేగం అధ్యక్షతన గురువారం బోస్ ఫెలోషిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అభిజిత్ మాట్లాడుతూ విద్యార్థులు కూడా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. శిక్షకురాలు కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం నాలుగు రోజుల పాటు జరుగుతుందని, సమాజానికి సంబంధించిన వివిధ అంశాలు నేర్పబడుతాయని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు చంద్రకాంత్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు పురస్కారాలు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,19 : అక్టోబర్ 1వ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులకు పురస్కారాలు అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు హైదరాబాద్‌లోని మలక్‌పేట నల్గొండ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, పురస్కారాల కేటగిరి ఇతర వివరాలకు www.wdsc.telangana.gov.in డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

## సమష్టి కృషితోనే వినాయక నిమజ్జనం పూర్తి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 19 : నిర్మల్ జిల్లాలో అధికారుల సమష్టి కృషితోనే వినాయక నిమజ్జనం, శోభాయాత్ర విజయవంతంగా పూర్తయిందని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. 12 రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసుల అధికారులు, క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది కృషి వల్లనే ఉత్సవాలను విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించామని తెలిపారు. పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



మమత

సారంగాపూర్, సెప్టెంబర్ 19 : సారంగాపూర్ మండలం జామ్ బాలికల గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న గాయక్వాడ్ మమత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. నిర్మల్ ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన స్టేట్ జేస్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. మమతను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, పీఈటీ సమత, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## బుద్ధవిహార్ నిర్మాణానికి భూమిపూజ

భైంసాటౌన్, సెప్టెంబర్ 19 : మిర్జాపూర్ గ్రామంలో బుద్ధ విహార్ నిర్మాణానికి ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. బుద్ధ విహార్ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు సూర్యం రెడ్డి రూ.4 లక్షల విలువ గల మంజూరు పత్రాన్ని ఆందజేశారు. మాజీ ఎంపీపీ రజాక్, నాయకులు పాల్గొన్నారు.

## పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముథోల్, సెప్టెంబర్ 19: పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో వరి పంటలను పరిశీలించారు. తెగుల నివారణకు కాఫర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు లేదా స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట శాస్త్రవేత్త విజయ్, రైతులు ఉన్నారు.

## 30న చలో హైదరాబాద్

ఎదులాపురం, సెప్టెంబర్ 19 : నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలు, మూడు నేర చట్టాలను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న ఛలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ ధర్నాలో అన్ని వర్గాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుభాష్, శేషారావు, నర్సింగ్, దేవీదాస్, జనార్దన్, ప్రసాద్, గణేశ్, రమాకాంత్, సంతోష్, ప్రదీప్ పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 19: నిర్మల్‌లో గణేశ్ నవరాత్రుల ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 16న బంగల్‌పేట్ ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ గణేశ్ మండలి వాహనాన్ని ముందుకు వెళ్లమని పోలీసులు చెప్పగా వారి మాట వినకుండా దూషిస్తూ రోడ్డుపై కూర్చున్న ఆదుముల్ల వినయ్, రాకేశ్, కపిల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## చిన్నారుల్లో పౌష్టికాహార లోప నివారణ లక్ష్యం

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 19 : చిన్నారుల్లో పౌష్టికాహార లోప నివారణే పోషక పాత్ర- మన వంట అంగన్‌వాడీ ఇంట ముఖ్య ఉద్దేశ్యమని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో పోషక పాత్ర- మన వంట అంగన్‌వాడీ ఇంట పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.